AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com
30-10-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

దళారుల దోపిడీపై రైతన్న ఆగ్రహం



2



2

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం..

31న అంతరిక్ష కేంద్రం సందర్శించేందుకు ప్రతిభా పరీక్ష

అక్షరటుడే, ఎల్లారెడ్డి: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సందర్శించేందుకు, అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 31న ప్రతిభా పరీక్ష (టాలెంట్ టెస్ట్) నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారులు రాజులు తెలిపారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధరామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎల్లారెడ్డి డివిజన్ విద్యార్థుల కోసం కామారెడ్డిలోని బృందావన్ గార్డెన్‌లో, బాన్సువాడ డివిజన్ విద్యార్థుల కోసం బోర్గం రోడ్డులోని వెంకటేశ్వర బీఈడీ కళాశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.



రోడ్డుపై చెత్తను పడేసిన బేకరీకి జరిమానా

అక్షర్టుడే, నందిపేట్ : నందిపేటలో రోడ్డుపై చెత్తను పడేసిన బేకరీకి పంచాయతీ అధికారులు రూ.500 జరిమానా విధించారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కార్యదర్శి మహేందర్ సూచించారు. చెత్తను రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా పంచాయతీ వాహనంలోని వేయాలని కోరారు.



బీజేపీ కార్యవర్గ సమావేశం

అక్షర్టుడే, నందిపేట్: భారతీయ జనతా పార్టీ నందిపేట, డొంకేశ్వర్ మండలాల కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీలో ప్రతి కార్యకర్త కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గోపిడి ప్రవంతిరెడ్డి, రాజు, రమేష్, గడ్డం చిన్నారెడ్డి, నాగ సురేష్, నాగ తారక్ పాల్గొన్నారు.



పోలీసుల పనితీరుపై అవగాహన

అక్షరటుడే, ముప్కాల్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకుని ముప్కాల్ కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.
సీఐ జాన్ రెడ్డి, ఎస్సై కిరణ్‌పాల్ విద్యార్థులకు పోలీస్ వ్యవస్థ పనితీరుపై అవగాహన కల్పించారు.

కామారెడ్డి బల్దియాలో మరోసారి ఆరోపణల పర్వం మొదలైంది. అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. బీఆర్ఎస్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపగా అధికార పక్షం అదే స్థాయిలో విరుచుకుపడింది. దాంతో బల్దియా రాజకీయం భర్తల పెత్తనంపై సరికొత్త వివాదానికి కేంద్ర బిందువుగా మారుతోంది. ఈ పరిణామం కామారెడ్డి రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. - అక్షరటుడే, కామారెడ్డి

బల్దియాలో కోల్డ్ వార్



- అధికార ప్రతిపక్షాల సవాళ్లు.. ప్రతిసవాళ్లు
- అవినీతి, వసూళ్ల ఆరోపణలపై దుమారం
- తెరపైకి నిమజ్జన స్కామ్ అమ్మకం
- 'భర్తల' పెత్తనంపై విమర్శలు
- హాట్ హాట్ గా బల్దియా రాజకీయం

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా మారాల్సిన కామారెడ్డి బల్దియా వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. పరస్పరం ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ బల్దియాకు మచ్చ తెస్తున్నారు. ఇటీవల సద్దుమణిగిన బల్దియా వివాదం మరోసారి రచ్చకెక్కింది. ఈసారి కబ్జాలు, వసూళ్లు తదితర అంశాలపై తీవ్ర రూపం దాల్చుతోంది. ఏకంగా ఛైర్ పర్సన్ భర్తను గెంటేస్తామంటూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు ఎక్కుపెడుతున్నారు. ఈ వివాదం చివరికి అధికారులపైకి మళ్లుతుండటంతో ఆసక్తికరంగా మారుతోంది.

అవినీతి.. వసూళ్లు..

బుధవారం బీజేపీ, గురువారం బీఆర్ఎస్ చేసిన వ్యాఖ్యలు అధికార పక్షాన్ని చుట్టుముట్టాయి. బల్దియా మొత్తం అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా మారిందంటూ బీజేపీ ఆరోపించింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ భర్తను బీఆర్ఎస్ టార్గెట్ చేసింది. పసూళ్లు చేస్తున్నారని, మానసిక వేధింపులకు గురి చేస్తున్నారంటూ తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు గుప్పించారు. చిలికి గాలివానలా మారే అవకాశాలు కనిపిస్తున్నాయన్న టాక్ వినిపిస్తోంది.

స్కామ్ అమ్మకంపై చర్చ

ఇటీవల గణేష్, దుర్గామాత ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. అక్కడక్కడా ఏర్పాట్ల విషయంలో ఆరోపణలు వచ్చినప్పటికీ ప్రశాంత వాతావరణంలో పండుగలు ముగిశాయి. అయితే గణేష్, దుర్గామాత విగ్రహాల నిమజ్జనం తర్వాత వాటికి సంబంధించిన ఇనుప స్క్రామ్ ఏమైందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాధారణంగా సంబంధిత స్క్రామ్ కోసం టెండర్ వేయాల్సి ఉండగా కొంతమంది కౌన్సిలర్లు అధికారులతో కలిసి అమ్ముకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంశాన్ని బీఆర్ఎస్ మరోసారి లేవనెత్తడంతో ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. కౌన్సిలర్లు అమ్ముకున్నారని బీఆర్ఎస్, అమ్ముకున్న వారి పేర్లు చెప్పాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు సవాళ్లు విసురుకుంటున్నారు.

కబ్జాలపై కన్నెర్ర

తాజాగా 16వ వార్డులో మున్సిపాలిటీకి సంబంధించిన ఓపెన్ స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణం జరుగుతుందన్న ఆరోపణలు బల్దియా రాజకీయాలను వేడెక్కించాయి. ఈ అక్రమ కట్టడానికి అధికార పక్షం మద్దతు ఇస్తుందన్న బీఆర్ఎస్ ఆరోపణలను కాంగ్రెస్ కౌన్సిలర్లు తీవ్రంగా ఖండించారు. ఈ క్రమంలో బల్దియాలో మున్సిపల్ ఓపెన్ స్థలాల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అసలు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఓపెన్ స్థలాలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఉన్నాయా అనే చర్చ సాగుతోంది. ఇరు పార్టీల నాయకులు కబ్జాలను సహించేది లేదని ఖరాఖండిగా చెబుతుండటం రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీస్తోంది.

అప్పుడు కలిసి..

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఛైర్‌పర్సన్ స్థానం గెలుచుకునేంత స్పష్టమైన మెజారిటీ రాలేదు. బీఆర్ఎస్ మద్దతుతో కాంగ్రెస్ పీఠం దక్కించుకుంది. గులాబీ పార్టీకి వైస్ ఛైర్‌పర్సన్ పదవి ఇచ్చారు. అలాగే కోఆప్షన్ ఎన్నికలో సైతం బీఆర్ఎస్ కు ప్రాధాన్యం ఇచ్చింది. అప్పుడు కలిసి పదవులు పంచుకున్న నాయకులు ఇప్పుడు.. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు.



అనధికార కట్టడాలపై చర్యలు తప్పవు: తహశీల్దార్

భీమ్‌గల్, అక్షరటుడే: పట్టణంలో మున్సిపల్ అనుమతులు లేకుండా చేపట్టే అనధికార నిర్మాణాలపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని భీమ్‌గల్ తహశీల్దార్ కిరణ్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందంతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలో నిర్మిస్తున్న పలు అనధికార కట్టడాలను బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహశీల్దార్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు నూతన గృహాలు లేదా భవనాలు నిర్మించాలనుకుంటే తప్పనిసరిగా మున్సిపాలిటీ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే తెలంగాణ పురపాలక చట్టం 2019 ప్రకారం కఠినచర్యలు తప్పవని తెలిపారు. ఈ తనిఖీల్లో తహశీల్దార్‌తో పాటు మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి, ఆర్‌అండ్‌బీ ఏఈ, ఫైర్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయవాదుల సంగమాన్ని విజయవంతం చేయాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : భాగ్యనగరంలోని నాగోల్ శుభం కన్వెన్షన్‌లో నవంబర్ 3న జరుగనున్న పూర్వ విద్యార్థి పరిషత్ కార్యకర్తలు, జాతీయవాదుల కలయిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుపుతూ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. పూర్వ విద్యార్థి పరిషత్ నాయకులు ఎం జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థి పరిషత్‌లో అనేక దశాబ్దాలుగా పనిచేసిన ఎక్కడెక్కడో స్థిరపడ్డటువంటి రాష్ట్రంలో ఉన్నటువంటి పూర్వ విద్యార్థి పరిషత్ కార్యకర్తలు అందరిని ఒక దగ్గరికి తీసుకురావడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థి పరిషత్ జాతీయ కార్యదర్శి, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, కాసం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా వస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడ్లూరి శ్రీనివాస్, యెండల సుధాకర్, స్వామి యాదవ్, చైతన్య, బిట్ల.రవి, బాలాజీ, వెంకటేష్, శరత్ చంద్రా, నవీన్, సాయి రెడ్డి పాల్గొన్నారు.



వైస్ ఛైర్‌పర్సన్ వెంట ఆమె భర్త రావడం లేదా? బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ కౌన్సిలర్ల ఫైర్

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి మున్సిపాలిటీలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. ఛైర్‌పర్సన్ భర్త మున్సిపాలిటీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారంటూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ఘాటుగా స్పందించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కౌన్సిలర్లు రౌడీలు, గుండాల మాదిరిగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఛైర్‌పర్సన్ భర్తపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గురువారం వైస్ ఛైర్‌పర్సన్‌తో పాటు ఆమె భర్త రాలేదా అని ప్రశ్నించారు. రాజకీయాల్లో ఉన్న మహిళలకు అండగా భర్తలు ఉండడం సహజమని, దాన్ని తప్పుగా చిత్రీకరించడం సరికాదు అని మండిపడ్డారు. సీసీ కెమెరాల యాక్సెస్ ఛైర్మన్ వద్ద మాత్రమే ఉందని, ఛైర్మన్ భర్త వద్ద లేదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాలను ఇష్టానుసారం కెమెరాలను తొలగిస్తుండడంతోనే ఛైర్మన్ వద్దే యాక్సెస్ ఉంచుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొత్తపల్లి లలిత, సుల్తానా, సావిత్రి, తహసున్నిసా, వాజీద్, బబ్లు, జావీద్, అంజాద్, గంగాధర్, కో-ఆప్షన్ సభ్యులు అలీ భీన్ అబ్దుల్లా, గొనె సునీత తదితరులు పాల్గొన్నారు.

సమీకృత సేంద్రియ సాగు విధానం భేష్

అక్షరటుడే నిజామాబాద్ సిటీ: తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు సాధించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు వేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయం, సమీకృత పంటల సాగు విధానాలను అవలంభించడం ద్వారా నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు రైతులు ఆర్థికంగా మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామంలో ఆర్మీ మాజీ ఉద్యోగి సీహెచ్ నవీన్ కుమార్ 'జై జవాన్ ఆగ్రో ఫార్మింగ్' పేరిట నిర్వహిస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. క్షేత్రంలో అమలు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, సమీకృత పంటల సాగు విధానాలను స్వయంగా పరిశీలించి, ఆదర్శ రైతు నవీన్ కుమార్ చేస్తున్న వినూత్న ప్రయోగాలను, కృషిని అభినందించారు. క్షేత్రంలో ఆకు కూరలు, వివిధ రకాల కూరగాయలు, పూల తోటలు, పండ్ల మొక్కలు, గానుగ, ఆయిల్‌పామ్, అరటి, కొబ్బరి సాగుతో పాటు చేపల పెంపకం, నాటుకోళ్ల పెంపకం వంటి విభిన్న వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలను కలెక్టర్ పరిశీలించారు. వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం చేపడుతూ, వాటి పేడ, మూత్రంతో జీవామృతం తయారు చేసి పంటలకు వినియోగిస్తున్న విధానం, భూగర్భ జలాల పెంపు కోసం వర్షపు నీటి సంరక్షణకు వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు ఏర్పాటు చేసుకోవడం వంటి వాటిని గమనించిన కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో విజయ కుమారి, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, తహశీల్దార్ దత్తాద్రి, రైతులు పాల్గొన్నారు.



ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల మౌన దీక్ష

అక్షరటుడే, కామారెడ్డి: కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె 18వ రోజుకు చేరుకుంది. శుక్రవారం సమ్మె శిబిరంలో ఉద్యోగులంతా మౌన దీక్షకు కూర్చున్నారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ఫ్రంట్ లైన్ వారియర్స్ అయిన తమను గుర్తించి పరిష్కార మార్గాలు చూపాలని జేఏసీ నాయకులు కోరారు. సమ్మె శిబిరాన్ని పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ.. తమతోపాటు సమానంగా పనిచేసే ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు ఎందులో తీసిపోలేదని, క్షేత్రస్థాయిలో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇంద్రసేనారెడ్డి సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఎన్‌హెచ్ఎం జేఏసీ అధ్యక్షుడు సుమన్, నాయకులు మారుతి, హరీష్, వెంకటరమణ, అశ్విని, మీనాక్షి, రవళి, మౌనిక, సంతోష్, మనోజ్, వేణు మాధవ్, రాహుల్, శోభ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

అక్షరటుడే, కామారెడ్డి: జిల్లాలో ఎన్‌హెచ్ఎం కింద కాంట్రాక్ట్ ప్రాతిపదికన వైద్య పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఒక మెడికల్ ఆఫీసర్, 9 స్పెషలిస్ట్ పోస్టులు కలిపి మొత్తం 10 పోస్టులను భర్తీ చేయనున్నారు. అందులో అనెస్థటిస్ట్ 2, మెడికల్ ఆఫీసర్ 1, ఓబీజీ స్పెషలిస్ట్ 3, పీడియాట్రీషియన్ 1, పీడియాట్రీషియన్ / మెడికల్ ఆఫీసర్ 2, సైకియాట్రిస్ట్ 1 పోస్టు ఉన్నాయి. అర్హతలు కలిగిన అభ్యర్థులు వచ్చే నెల 4వ తేదీ ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ లోని ఐడీఓసీలో ఉన్న జిల్లా వైద్యాధికారి కార్యాలయం రూమ్ నెం.105లో జరిగే వాక్‌ఇన్ ఇంటర్వ్యూకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసిన అప్లికేషన్‌తో హాజరు కావాలని అధికారులు తెలిపారు.

బీజేపీలోకి గజవాడ సోదరులు.. ఎంపీ అర్వింద్ ఆధ్వర్యంలో చేరిక

అక్షరటుడే, వెబ్‌డెస్క్: నిజామాబాద్ నగరానికి చెందిన గజవాడ సోదరులు ఇద్దరు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు ఎంపీ అర్వింద్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ గజవాడ హనుమంతరావు, అతని సోదరుడు మాజీ కార్పొరేటర్ సివిల్ ఇంజినీర్ గజవాడ గణేష్ గుప్తాలు బీజేపీలో చేరారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అర్వింద్ ధర్మపురి ఆధ్వర్యంలో ఇద్దరు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గజవాడ సోదరులను రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వారితో పాటు పలువురు రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారులు, ఇంజనీర్లు బీజేపీలో చేరారు. నిజామాబాద్ అర్బన్‌లో బీజేపీ బలోపేతానికి పార్టీ ఆదేశానుసారం పని చేస్తానని పార్టీలో చేరిన గజవాడ హనుమంతురావు, గణేష్ గుప్తా తెలిపారు. గజవాడ హనుమంతురావు ప్రస్తుతం దిశ కమిటీ సభ్యులుగా పనిచేస్తున్నారు. గజవాడ గణేష్ గుప్తా వైశ్య సామాజిక వర్గంతో పాటు ఇతర సామాజిక సేవా రంగాలలో క్రీయాశీలకంగా వ్యవహరిస్తున్నారు. భారతీయ జనతా పార్టీలో నగరానికి చెందిన వైశ్య సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు చేరిక సమయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు పార్టీలో చేరుతుండగా లోకల్ ఎమ్మెల్యే హాజరుకాకపోవడంలో మతలబు ఏమిటని చర్చ జరుగుతోంది.



పోలీస్ స్టేషన్‌లలో ఓపెన్ హౌస్



అక్షరటుడే, నిజామాబాద్ క్రైమ్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు పోలీసుల పనితీరుపై అవగాహన కల్పించారు. ఆయుధాలను చూయించారు. రిసెప్షన్ కౌంటర్ ఏ విధంగా నిర్వహిస్తారు, సీసీటీఎన్ఎస్ పనితీరు, ఎఫ్ఐఆర్ నమోదు ఏ విధంగా చేస్తారో వివరించారు.

అక్షరటుడే, నందిపేట్: నందిపేట్ పోలీస్ స్టేషన్లో స్కూల్ విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసుల రోజువారి విధులు, పని విధానం గురించి క వివరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి స్కూల్, అక్షర స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో రక్తదాన శిబిరం



అక్షరటుడే, డిచ్‌పల్లి: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా డిచ్‌పల్లి ఏడో బెటాలియన్ కమాండెంట్ సీతారాం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వచ్ఛందంగా 71 మంది రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ దేవినేని శ్రీనివాస్, విజయ్, మెడికల్ ఆఫీసర్ అనుపమ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సతీష్, జీజీహెచ్ డాక్టర్ భార్గవి జోషి, శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్స్ సందీప్, చందు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ కుటుంబానికి ఆర్థికసాయం



అక్షరటుడే, పెద్దకొడప్‌గల్: మండలంలోని బేగంపూర్ తండాకు చెందిన అంగన్వాడీ టీచర్ నాగుబాయి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, సూపర్‌వైజర్, సీడీపీవో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సాయం అందజేశారు.

బస్సాపూర్ శివారులో పోలీసుల తనిఖీలు



అక్షరటుడే, బాల్కొండ: బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్సాపూర్ శివారులో పాత జాతీయ రహదారిపై పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని వాహనదారులతో పాటు హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై చిన్నయ్య, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



దళారుల దోపిడీపై రైతన్న ఆగ్రహం..

- దళారులు, మిల్లర్ల ఇష్టారాజ్యం
- రైతుల వద్ద తక్కువ ధరకే వడ్ల కొనుగోలు..
- మార్కెట్లో మూడు రెట్లు ఎక్కువగా బియ్యం అమ్మకం
- ధరల నియంత్రణలో యంత్రాంగం విఫలం

దళారులు, మిల్లర్లు కలిసి అన్నదాతను నిలువునా ముంచుతున్నారు.. తక్కువ ధరకే వారి వద్ద వడ్లను కొనుగోలు చేసి మార్కెట్లో మూడు రెట్లు ఎక్కువగా బియ్యం రూపంలో విక్రయిస్తూ అడ్డగోలుగా దోచుకుంటున్నారు.

- అక్షరటుడే, నందిపేట్

నందిపేట్ ప్రాంతంలో వరి సాగు చేసిన రైతులు దళారులు, రైస్ మిల్లర్ల సిండికేట్ వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్లో బియ్యం ధరకు అనుగుణంగా వడ్లకు సరైన మద్దతు ధర లభించకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.

ధర వ్యత్యాసంతో ఇబ్బందులు..

దళారులు రైతుల వద్ద క్వింటాలు వడ్లను కేవలం రూ.2,900 లకు కొనుగోలు చేస్తున్నారు. ఒక క్వింటా వడ్ల నుంచి దాదాపు 65 నుండి 70 కిలోల బియ్యం వస్తుంది. కొనుగోలు చేసిన ధర ప్రకారం బియ్యాన్ని కిలో రూ.52 రూ.55 కు విక్రయించాల్సి ఉండగా, మిల్లర్లు మార్కెట్లో రూ.80 నుండి రూ.90 వరకు అమ్ముతూ అధిక లాభాలు గడిస్తున్నారు.

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో బియ్యం ధరలకు తగ్గట్లు వడ్ల ధర లేకపోవడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దళారులు రైతుల దగ్గర ధాన్యంను తక్కువ ధరకు కొనుగోలు చేసి రిటైల్ లో మూడు రేట్లు ఎక్కువకు అమ్ముతున్నారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

ప్రభుత్వం వెంటనే స్పందించి దళారుల, మిల్లర్ల దోపిడీని అరికట్టాలి. మార్కెట్లో బియ్యం ధరలకు అనుగుణంగా రైతు పండించిన పంటకు సరైన మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుని ఆదుకోవాలి. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న దళారులు సిండికేట్ అయి రేట్లు తగ్గిస్తున్నారు.

- పోతుల పెద్దన్న, నందిపేట్



విద్యార్థులను ప్రశస్తి యాప్‌లో నమోదు చేయాలి

అక్షరటుడే, ఆర్మూర్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి వివరాలను సమగ్ర శిక్ష ప్రశస్తి యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఎంఈవో రవీందర్ అన్నారు. పట్టణంలోని మోడల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో దివ్యాంగులను గుర్తించడానికి ఈ స్క్రీనింగ్ ప్రక్రియ ఉపయోగపడుతుందన్నారు. ఎమ్మార్పీ సురేందర్, ఐఈఆర్పీలు కిషన్, సురేష్ ప్రశస్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్ రఘు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాదిగ మహారాజుల శోభాయాత్రను జయప్రదం చేయాలి

అక్షరటుడే, బాల్కొండ: మండలంలోని అన్ని గ్రామాల నుండి మాదిగలు తరలి వచ్చి ఆదివారం నిర్వహించనున్న మాదిగ మహారాజుల శోభాయాత్రను విజయవంతం చేయాలని నిశాంత్ మహారాజ్ కోరారు. ఈ శోభాయాత్ర రాజకీయ పార్టీలకు అతీతంగా,మతలకీతతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదిగల ఐక్యత చాటే ప్రతిష్టాత్మకమైన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా విశారదన్ మహారాజ్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జాగృతి సంఘం నాయకులు సతీష్, రంజిత్, ఆత్మ గౌరవ్, రాజశేఖర్, కార్తీక్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు

అక్షరటుడే, కామారెడ్డి: కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్లిన వ్యక్తిని మాచారెడ్డి పోలీసులు కాపాడారు. మాచారెడ్డి మండలం పోతారం గ్రామానికి చెందిన 36 ఏళ్ల వ్యక్తి కుటుంబ సమస్యలతో భార్యతో గొడవపడి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఆత్మహత్య చేసుకుంటానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిపోయాడు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే డయల్ 112కు సమాచారం అందించారు. పోలీస్ కంట్రోల్ రూమ్ తక్షణమే స్పందించి మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరవేసింది. మాచారెడ్డి ఎస్సై కొండ విజయ్ వెంటనే వ్యక్తికి ఫోన్ చేసి ఆవేశపూరిత నిర్ణయాలు వద్దని, ధైర్యంగా ఉండాలని చెబుతూ కౌన్సెలింగ్ ప్రారంభించారు. మరోవైపు సిబ్బంది సుధాకర్ రెడ్డి, నరేందర్ లను ఘటనా స్థలానికి పంపించారు. ఎస్సై ఫోన్‌లో మాట్లాడుతుండగానే సిబ్బంది అక్కడికి



చేరుకుని అతన్ని సురక్షితంగా స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం భార్యా భర్తలిద్దరికీ కౌన్సెలింగ్ నిర్వహించి, సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చిట్యాలలో శ్రీకృష్ణ మందిర నిర్మాణానికి భూమిపూజ

అక్షరటుడే, ఎల్లారెడ్డి: గ్రామాల్లో భక్తిభావం, ఆధ్యాత్మికతతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించడంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. తాడ్వాయి మండలం చిట్యాల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీకృష్ణ మందిర నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకృష్ణ మందిర నిర్మాణం గ్రామ ప్రజలకు ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణం త్వరగా పూర్తయి భక్తులకు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





దుబ్బలో ఘనంగా స్వచ్ఛత కార్యక్రమం

అక్షరటుడే,నిజామాబాద్ సిటీ: స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 6.0లో భాగంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం, నిజామాబాద్ అర్బన్ ప్రాజెక్టు, మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 16వ డివిజన్ దుబ్బ పరిధిలో శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అనిత సురేష్, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ సౌందర్య, ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి, ఎస్ఐ మహిపాల్ తదితరులు పాల్గొని మున్సిపల్, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అనిత సురేష్, డీడబ్ల్యూవో సౌందర్య మాట్లాడుతూ.. స్వచ్ఛత అనేది ఒక రోజుతో ముగిసేది కాదని, ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. చెత్తను రోడ్లపై వేయకుండా, పరిసరాల పరిశుభ్రతతో పాటు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని, స్వచ్ఛఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

లారీని ఢీకొన్న టూరిస్ట్ బస్సు.. 25 మందికి పైగా గాయాలు!

అక్షరటుడే, ఎల్లారెడ్డి: పెళ్లి వేడుకకు సంతోషంగా బయలుదేరిన వారిని రోడ్డు ప్రమాదం భయాందోళనకు గురిచేసింది. రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని టూరిస్ట్ బస్సు ఢీకొట్టడంతో 25 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బీర్కూరు మండలం నుంచి కోదాడలో జరుగుతున్న వివాహ వేడుకకు ప్రయాణికులతో టూరిస్ట్ బస్సు బయలుదేరింది. ఈ క్రమంలో భిక్కనూరు సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని బస్సు ఢీకొట్టింది. డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు పేర్కొన్నారు. సుమారు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్న బస్సు ఒక్కసారిగా లారీని ఢీకొనడంతో ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాద తీవ్రతకు బస్సులోని ప్రయాణికులు ముందున్న సీట్లకు, ఒకరినొకరు ఢీకొని గాయపడ్డారు. బస్సు నుంచి బయటకు వచ్చే ద్వారాలు సైతం లాక్ కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. క్షతగాత్రులను అద్దాలు పగలగొట్టి బయటకు తీసుకువచ్చి న సిబ్బంది, తోటి ప్రయాణికులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారికి వైద్య చికిత్సలు అందించారు. కామారెడ్డి మెడికల్ కాలేజీ ఆర్ఎంవో డాక్టర్ రవీందర్ గౌడ్, డ్యూటీ డాక్టర్లు ఆసుపత్రిలో ఉండి బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం ప్రయాణికులు క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రైతులు ఆరుతడి పంటలనే సాగు చేయాలి



అక్షరటుడే, ఆర్మూర్ : ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలనే సాగు చేయాలని, ప్రభుత్వ సూచనలు పాటించాలని ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సమృద్ధిగా కురువక భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రానున్న రోజుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతుందని అన్నారు. తాగునీటికే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. కావున రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరుతున్నామన్నారు. అదేవిధంగా రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు పాటించాలని కోరారు.

విద్యుత్ సమస్య పరిష్కారంతో కాలనీవాసుల హర్షం



అక్షర టుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు ఇందిరానగర్ కాలనీలో గత కొన్ని రోజులుగా వేధిస్తున్న తక్కువ వోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభించింది. కాలనీవాసుల విద్యుత్ కష్టాలను గుర్తించిన 6వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ గఫార్ స్పందించి, విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఈ మేరకు కాలనీలో నూతనంగా 15 కేవీఏ సామర్థ్యం కలిగిన సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. దీంతో కాలనీలో విద్యుత్ సరఫరా మెరుగుపడి, తక్కువ వోల్టేజ్ సమస్య తొలగిపోతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో రోజులుగా తమను ఇబ్బందులకు గురిచేస్తున్న విద్యుత్ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన కౌన్సిలర్ సయ్యద్ గఫార్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.